

రేపటి నుంచి ఉరుసు ఉత్సవాలు

విజయనగరం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోట జంక్షన్‌లో వున్న డేంఖేషావలీ బాబా దర్గా వద్ద ఈనెల 17 నుంచి మూడు రోజులు పాటు ఉరుసు ఉత్సవాలు జరగనున్నాయి. ఏర్పాట్లు పూర్తయ్యాయని దర్గా సేవకుడు ఖాదమ్ షేక్ బహదూర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఖురాన్ పఠనం సహా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 17న నగరంలోని పలు ప్రాంతాల గుండా మహా ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భారీ అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

వాడవాడలా సంక్రాంతి

- ఘనంగా ముగిసిన మూడు రోజుల పండుగ
- బంధువులు, కుటుంబ సభ్యులతో కిటకిటలాడిన ఇళ్లు



శిల్పారామంలో సంస్కృతిక ప్రదర్శన



విజయనగరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల సంక్రాంతి పండుగ బుధవారం కనుమతో ముగిసింది. ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు, హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల ఆటలు, ఆకాశంలో గాలిపటాలు, కొత్త దుస్తుల్లో చిన్నారులు, యువత కనిపించి కనువిందు చేశారు. చుట్టాలు, బంధువుల రాకతో గ్రామాల పరిసరాలన్నీ కొత్తదనాన్ని సంతరించుకున్నాయి. అలనాటి పాత వంటకాలు అంతగా లేకపోయినా నేటి తరానికి తెలిసిన పిండి వంటలు చేయడం కన్పించింది. కూతుళ్లు, కోడళ్లు, అల్లుళ్లు సందడే సందడి చేశారు. ఇక కనుమ పండుగ అనగానే ఎక్కువ మంది మాంసాహారం వైపు మొగ్గు చూపుతారు. దీంతో చికెన్ ధర కిలో వద్ద రూ.20 పెరిగింది. మటన్ ధర కిలో విజయనగరంలో రూ.800 వుంది. మూడోరోజు మాంసం, చేపలు విక్రయించే షాపులు తప్ప మిగతా షాపులు తీయకపోవడంతో విజయనగరం నిర్మానుష్యంగా మారింది. మూడు రోజుల ముందు బిజీగా వుండే మూడులాంతర్లు, గంటస్తంభం, కోట, ఎంజీ రోడ్డు తదితర ప్రాంతాలు బుధవారం కర్ఫ్యూను తలపించాయి.

తెగ తాగేశారు..

విజయనగరం క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూడురోజుల్లో రూ.22 కోట్ల మద్యం అమ్మకాలు జిల్లాలో జరిగాయి. జిల్లాలో 177 మద్యం షాపులు, 28 బార్లు వుండగా 42 వేల మద్యం కేసుల విక్రయాలు జరిగాయి. గత ఏడాది రూ.20 కోట్లు అమ్మగా ఈ ఏడాది రూ.2 కోట్లు అదనంగా ఎక్సైజ్ శాఖకు ఆదాయం వచ్చింది. భోగి నుంచి కనుమ వరకూ వైన్‌షాపులు, బార్లు మందుబాబులతో కిటకిటలాడుతూ కన్పించాయి.



రామతీర్థం దేవస్థానం ఆవరణలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం



కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి వేడుకలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కుటుంబ సమేతంగా మంత్రి శ్రీనివాస్..

విజయనగరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి గంట్యాడలో సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. భోగి వరకూ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన సంక్రాంతి, కనుమ రోజుల్లో గంట్యాడలోనే ఉన్నారు. తండ్రి కొండలరావు, చిన్నాన్న కొండపల్లి అప్పలనాయుడు, ఇతర కుటుంబసభ్యులతో కలిసి పండుగ చేసుకున్నారు.

శిల్పారామంలో సందడి..

విజయనగరం రూరల్, జనవరి 15: నగరంలోని బాబామెట్టకు వెళ్లే రహదారిలో వున్న శిల్పారామంలో సంక్రాంతి సందడి నెలకొంది. మూడు రోజుల పాటు ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. యువకులంతా కలిసి గాలిపటాలను ఎగురవేశారు. బుధవారం ముగింపు కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ నృత్య గురు పురస్కార గ్రహీత మయూరి నృత్యాలయం డైరెక్టరు శ్రీదేవి కృష్ణ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చారు.

రామతీర్థంలో ఘనంగా గోపూజోత్సవం..

నెల్లిమర్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనుమ పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానంలో బుధవారం గోపూజ కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.. అనంతరం ఆస్థాన మండపంలో ఉత్సవ మూర్తులకు నిత్య కల్యాణోత్సవం కూడానిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జన్మనిచ్చిన భూమిని.. తల్లిదండ్రులను మరువరాదు

- స్వగ్రామ సందర్శనలో హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవికుమార్

మెరకముడిదాం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన భూ మిని, కన్న తల్లిదండ్రులను ఎప్పటికీ మరువరాదని, జీవితంలో వారి స్థానం చాలా గొప్పదని హైకోర్టు జడ్జి చీమలపాటి రవికు మార్ చెప్పారు. స్వగ్రామం బైరిపురం వచ్చిన ఆయన కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఆయనకు తొలు త గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని వృద్ధులు, పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. స్వగ్రా మం రావడం ఆనందంగా ఉందని, స్థానికుల ఆదరాభిమానులు చూస్తుంటే మధురానుభూతి కలిగిందని చెప్పారు. కుటుంబ సభ్యులు చీమలపాటి శ్రీరాంమూర్తి, శేఖర్, చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవికుమార్



పండుగ ముందు విజయనగరం



పండుగ తర్వాత



పండుగ ముందు మార్కెట్



పండుగ తర్వాత

200 వంటకాలతో అల్లుడికి ఆతిథ్యం
- విజయనగరంలో ఉంటున్న గోదావరి జిల్లా వాసుల ప్రత్యేకం
- ఆశ్చర్యపోయిన చినతాడివాడ గ్రామస్థులు

7లో

సైబర్ నేరాలపై అప్రమత్తం
- డిపాజిట్ స్కాంలను నమ్మవద్దు: ఎస్పీ

7లో

కిటకిటలాడిన తాటిపూడి
- రిజర్వాయర్‌కు సంక్రాంతి కళ

7లో

బైక్‌ను ఢీకొట్టి.. 100 అడుగులు ఈడ్చుకెళ్లి!

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితుల దుర్మరణం



మృతిచెందిన లవన్‌కుమార్(ఫైల్)

బొండపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బైకును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయిన ఘటన మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి పంచాయతీ పరిధి శివారు గ్రామం చందకపేటకు చెందిన లవన్‌కుమార్ (25)తో పాటు స్నేహితుడు ఒడిశాకు చెందిన లక్ష్మణ్‌రంజిత్‌దాస్(25) కలిసి బైక్‌పై గొట్లాం నుంచి విజయనగరం వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న ట్యాంకర్ లారీ వీరిని బలంగా ఢీకొంది. సుమారు వంద అడుగుల వరకు బైకును లారీ ఈడ్చుకొని వెళ్లడంతో కింద పడిన ఇద్దరూ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్నేహితులిద్దరూ గజపతినగరంలోని ఓ కార్పొరేట్ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నారు. లవన్‌కుమార్‌కు ఏడాది క్రితం వివాహం జరిగింది. మూడు నెలల బాబు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేష్ తెలిపారు.

డ్రోన్లతో నిఘా

- సంక్రాంతి పండుగలో ప్రయోగం
- నగరం, మండల పరిధిలో పరిశీలన



విజయనగరం క్రైం, జనవరి15(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతోంది. ఇప్పటికే సీసీ కెమెరాలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీసులు మరో అడుగు వేశారు. డ్రోన్‌ల వ్యవస్థను తీసుకువచ్చారు. ఈ డ్రోన్‌లను రానున్న కాలంలో మరింత విస్తరించనున్నారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలో అసాంఘిక కార్యకలాపాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం తదితర లక్ష్యాలతో డ్రోన్‌లను తీసుకువచ్చారు. ప్రయోగాత్మకంగా సంక్రాంతి పండుగలో కోడి, గొర్రెల పందేలు, జూదంపై నిఘా పెట్టారు. విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో డ్రోన్లను ప్రయోగించారు. వాటిని ఎగురవేస్తూ స్టేషన్‌లో వుండి సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

నేర నియంత్రణకు డ్రోన్లతో నిఘా: ఎస్పీ

నేరాలను నియంత్రించేందుకు డ్రోన్లతో నిరంతరం పర్యవేక్షించనున్నట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ రెగ్యులేట్ చేయడంతో పాటు నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టేందుకు వినియోగిస్తామన్నారు. విజయనగరం పట్టణం, రూరల్ ప్రాంతంలోని దుప్పాడ, అయ్యన్నపేట, ధర్మపురి, జమ్మునారాయణపురం, రాజాం పట్టణం, మండల శివార్లలో సీఐలు, ఎస్ఐల పర్యవేక్షణలో డ్రోన్స్ పంపి కోడి, గొర్రె పందేలు, ఓపెన్ డ్రింకింగ్‌ను నియంత్రించామన్నారు.

అక్కడ బహిరంగం.. ఇక్కడ రహస్యం..!

- పండుగ బరిలో పందెం కోళ్లు
- జిల్లాలో ఎక్కడికక్కడ కోళ్లకు కత్తి కట్టి పందేలు
- డ్రోన్‌లతో నిఘా పెట్టినా బెదరని నిర్వాహకులు

గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోనేనా కోడికి కత్తె కట్టేది.. మేము కూడా కట్టగలమంటూ జిల్లా పోలీసులకు పందెంరాయుళ్లు సవాల్ విసురుతున్నారు. అక్కడ బహిరంగంగా కోళ్ల పందేలు జరుగుతుంటే.. ఇక్కడ రహస్యంగా బరిలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొండలు, మెట్టలు, తోటల్లో ఎక్కడో చోట బరి సిద్ధం చేసేస్తున్నారు. పోలీసులొచ్చేలోపే పని కానిచ్చేస్తున్నారు. పండుగ మూడు రోజులూ జిల్లాలో చాలాచోట్ల గుట్టుగా కోడిపందాలు సాగాయి. పోలీసులు డ్రోన్‌లతో నిఘా పెట్టినా నిర్వాహకులు బెదరలేదు. ఎక్కడికక్కడ కోళ్లకు కత్తి కట్టి పందేలు వేసుకుని సరదా తీర్చుకున్నారు.



ఎస్.కోట మండలంలో..

శృంగవరపుకోట రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రారంభమైన తీర్థాల్లో జోరుగా కోడి పందాలు జరిగాయి. మకర సంక్రాంతి రోజు నుంచి గుట్టుగా రహస్య ప్రదేశాల్లో పందేలు నిర్వహిస్తున్నారు. బుధవారం మరిన్ని ప్రాంతాల్లో జరిగాయి. పోలీసులకు తెలిసేటప్పటికి అక్కడి నుంచి జారుకుంటున్నారు.



ఎస్.కోట మండలం బొడ్డవర సమీపంలో కోడిపందేల దృశ్యం

శృంగవరపుకోట జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి కొన్ని జిల్లాల పల్లె వాసులకు బాగా ఆనందాన్నిచ్చే క్రీడల్లో కోడి పందెం ఒకటి. ఏటా ఎక్కడెక్కడో వున్న వారంతా ప్రత్యేకంగా వీటిని చూసేందుకే తప్పకుండ ప్రయాణమవుతారు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ సంస్కృతి రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాలకు కూడా పాకింది. అయితే అక్కడంతా బహిరంగమే. జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధం. ఇక్కడంతా రహస్యం. సంక్రాంతికి వారం రోజుల ముందు నుంచి పోలీస్‌ల హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఎస్పీ వకుల్‌జిందాల్ సాంకేతికను ఉపయోగించి డ్రోన్‌లతో నిఘా పెట్టించారు. ఎక్కడ పేకాట, పందేల స్థావరాలున్నా పట్టేస్తామంటూ ప్రచారం చేయిస్తున్నారు. అయినప్పటికీ కోళ్ల పందెం రాయళ్లు వెనక్కి తగ్గడం లేదు. తమను కనిపెట్టలేరంటూ రహస్య ప్రదేశాల్లో కోడికి కత్తె కట్టేస్తున్నారు. పోలీస్‌ల కళ్లు కప్పి భయంతో కూడిన ఆనందం పొందుతున్నారు. ఒక వేళ పోలీస్‌లు పట్టుకొనేందుకు ఇటు వైపు వచ్చినా దొరకకుండా దారులను ముందే వెతుక్కుంటు న్నారు. పందెం బరిలకు కిలో మీటరు దూరంలో రహస్యంగా వేగులను పెడుతున్నారు. సివిల్ దుస్తుల్లో పోలీస్‌లు వచ్చినా కనిపెట్టేస్తు న్నారు. వీరొస్తున్న విషయాన్ని ఫోన్‌ల ద్వారా సమాచారం అందించేస్తున్నారు. బరిల వద్దకు పోలీస్‌లు చేరుకున్న లోపే అక్కడ నుంచి ఉడాయిస్తు న్నారు. మరో చోట ముందే సిద్ధం చేసుకున్న మకాం వద్దకు చేరిపోతున్నారు. పోలీస్‌లను ముప్పుతిప్పలు పెడుతున్నారు.

- రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో సంక్రాంతితో కోడి పందాలు ముగుస్తాయి. జిల్లాలో మాత్రం (మిగతా 8వ పేజీలో..)

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయనగరం ● గురువారం 16 జనవరి 2025

పండగవేళ... సరికొత్త లుక్కులు



సంక్రాంతి సందర్భంగా స్టార్ హీరోల నుంచి చిన్న హీరోలు నటిస్తున్న సినిమాల వరకు కొత్త పోస్టర్స్ విడుదలయ్యాయి. ఈ ప్రచార చిత్రాలతో ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.


'రాజాసాబ్' నుంచి ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నారీ నారీ నడుమ మురారీ' టైటిల్‌ను ప్రకటించారు. విశ్వక్‌సేన్ నటిస్తున్న 'లైలా'లో ఫీమేల్ లుక్‌ను రివీల్ చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'బ్రహ్మ ఆనందం' నుంచి కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ జంటగా తెరకెక్కుతున్న 'దిల్‌రూబా' వచ్చే నెల 14న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

తారల సంక్రాంతి సంబరాలు









తారలు సంక్రాంతిని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి ట్రెడిషనల్ లుక్‌లో కనువిందు చేశారు. రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసన, కూతురు క్లీంకారతో కలసి ఫొటో దిగారు. అల్లు అర్జున్ తన సతీమణి స్నేహా రెడ్డి, కూతురు అర్హ, తనయుడు అయాన్‌తో కలసి పిక్ తీసుకున్నారు. మోహన్‌బాబు దంపతులు, తనయుడు విష్ణు ఫ్యామిలీతో తిరుపతిలో కలసి ఫొటోలు దిగారు. వరుణ్‌తేజ్ తన సతీమణి లావణ్యతో కలసి గాలిపటాలు ఎగరేస్తూ ఫొటోలకు ఫోజిచ్చారు. నూతన దంపతులు నాగచైతన్య, శోభితా ధూళిపాళతో సంప్రదాయ దుస్తుల్లో పిక్ తీసుకున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కీర్తి సురేశ్, ఆంటోని తట్టిల్ జంటగా పండగ వేడుకల్లో తీసుకున్న ఫొటోలను షేర్ చేశారు. అలాగే విఘ్నేష్ నయనతార దంపతులు పిల్లలతో కలసి దిగిన పండగ ఫొటోను షేర్ చేశారు.




నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్



'మా సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, అభిమానులకు ధన్యవాదాలు. మేం మంచి ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనే ఆలోచనతో సంక్రాంతికి వస్తున్నాం అని చెప్పాం. నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు అనిల్‌కు థాంక్స్' అని అన్నారు విక్టరీ వెంకటేశ్. ఆయన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలై విజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ 'సాధారణంగా బెనిఫిట్ షోలకు ఫ్యాన్స్, యూత్ వెళుతుంటారు. కానీ తొలిసారి ఉదయం నాలుగున్నర షోకి ఫ్యామిలీ ఆడియన్స్ రావడం చాలా ఆనందం కలిగించింది' అన్నారు. సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు నిర్మాత దిల్ రాజు ధన్యవాదాలు తెలిపారు. పైరసీని ఎంకరేజ్ చేయకుండా థియేటర్లలోనే సినిమా చూడాలని ఆయన కోరారు.

అందమైన ప్రేమకథ



'బేబీ' కలయిక మరోసారి రిపీట్ అవుతోంది. ఆ సినిమాతో సూపర్ హిట్ కొట్టిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవిచైతన్య జంటగా మరో చిత్రం తెరకెక్కనుంది. '90స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య హసన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మేరకు 'యాన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ' పేరుతో ఓ అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల చేశారు. 'మీరు చూసిన మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా '90స్'లోంచి పుట్టిన అందమైన ప్రేమకథ ఇది. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా చిత్రం తెరకెక్కనుంది" అని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు. ఈ సినిమాకు ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రాఫర్: అజీమ్ మహమ్మద్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.

ఆస్కార్ వేడుక రద్దు అవుతుందా?



అమెరికాలోని లాస్‌ఏంజిల్స్ ప్రాంతాన్ని కార్చిచ్చు చుట్టుముట్టి, ఎంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలిగించిన ఫలితం ఇప్పుడు ఆస్కార్ అవార్డుల వేడుకలపై కూడా ప్రభావం చూపుతోందా?. టామ్ హాంక్స్, ఎమ్మా స్టోన్, మెల్ గిబ్సన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి హాలీవుడ్ ప్రముఖులు ఈ అగ్ని ప్రమాదంతో ఇళ్లు కోల్పోయారు. అలాగే ఆస్కార్ కమిటీలోని నలుగురు సభ్యులు కూడా ఈ కార్చిచ్చు వల్ల ఇళ్లు కోల్పోవడంతో మార్చి రెండున జరగాల్సిన ఆస్కార్ వేడుక రద్దు కావచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే.. 96 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో అవార్డుల వేడుక రద్దు కావడం ఇదే తొలిసారి అవుతుంది. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా ఆస్కార్ కమిటీ వేడుకని వాయిదా వేసింది తప్ప రద్దు చేయలేదు. ఇప్పుడు కూడా అలాగే చేయవచ్చని కొంతమంది అంటున్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో ఇలా కార్చిచ్చు వ్యాపించి లాస్ ఏంజిల్స్‌ను బూడిద కుప్పగా మార్చడంతో ఈ నెల 23న జరగాల్సిన నామినేషన్స్ ప్రకటన వాయిదా వేశారు. పరిస్థితిని గమనిస్తున్న ఆస్కార్ కమిటీ అవార్డుల వేడుక జరిగే తేదీలో ఏదన్నా మార్పు ఉంటే త్వరలో ప్రకటిస్తుందని అంటున్నారు.



రాజాం రూరల్: గంగిరెద్దుకు పూజలు చేస్తున్న దృశ్యం



ఎస్.కోట: బొడ్డవరలో ఎమ్మెల్సీ రఘురాజు ఇంట సంక్రాంతి సందర్భంగా ఒకేచోట కుటుంబ సభ్యులు



ఎస్.కోట రూరల్: ఒకే ఆకులో పిండివంటలు ..

సందడే.. సందడి

- పెద్ద పండుగతో ఊరూరా కోలాహలం
- ముగ్గులు, వంటల పోటీలు, ఆటపాటలతో జోష్
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో కళకళ



గంట్యాడలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీ

నెల్లిమర్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఊరూరా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో ముగ్గులు, వంటల పోటీలు నిర్వహించారు. ఆటపాటలతో సందడి నెలకొంది. కొన్నిచోట్ల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. మండలంలోని వల్లూరులో మంగళవారం రాత్రి ముగ్గుల పోటీలతో పాటు మాథ్స్ టాలెంట్ టెస్ట్, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, విజయనగరం ఎయిమ్ విద్యాసంస్థల చైర్మన్ కడగల ఆనంద్‌కుమార్ విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన గాయకుడు మల్లపురెడ్డి చంద్రశేఖర్ అధ్వర్యంలో పాటల కచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

●శృంగవరపుకోట: మండలంలో పెద్దపండుగ సందర్భంగా సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు చేరారు. విదేశాల్లో ఉన్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కుటుంబసభ్యులు బొడ్డవర చేరుకుని సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

●శృంగవరపుకోట రూరల్: రాష్ట్రం నలుమూలల ఉన్న ఎస్.కోటలోని సదరం రాములమ్మ(90) కుటుంబసభ్యులు సొందూరు చేరుకుని ఆటపాటలతో సందడి చేశారు. ఒకే అరటి ఆకులో విందు భోజనాలు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. అలాగే.. మండలంలోని సీతారాంపురంలో టీడీపీ రాక్‌స్టార్స్ ఆధ్వర్యంలో వంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోకుల అచ్చెంనాయుడు, తాటిపూడి రిజర్వాయర్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎల్.రాము తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

●భోగాపురం: భోగాపురంలోని కొమ్మూరువీధికి చెందిన ఆళ్లచిన్నయ్యదొర కుటంబీకులు సంక్రాంతి పండగను పురస్కరించుకుని వేర్వేరు చోట్ల స్థిరపడిన సుమారు 25 కుటుంబాలు కనుమ రోజున ఒకేచోట కలిశారు. సంతోషంగా గడిపారు.

●రాజాం రూరల్: సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇల్లు కళకళలాడింది. వి.ఆర్.అగ్రహారంలో బోనాల పండగ నిర్వహించారు. బొద్దాంలో చిన్నారుల కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కనుమ సందర్భంగా సోమవారం ఆవులకు పిండివంటలు పెట్టి పూజలు నిర్వహించారు. పట్టణంలోని తృప్తి రిసార్ట్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి వేడుకలు ఆకట్టుకున్నాయి.

●గంట్యాడ: మండలంలో కొండ తామారాపల్లి, నందాం గ్రామాల్లో బుధవారం రంగోళి పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం లక్కిడాం, బోనంగి, పెదవేమలి గ్రామాల్లో తీర్థ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.



నెల్లిమర్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆనంద్‌కుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

విజయనగరం క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు టెక్నాలజీని ఉపయోగించి కొత్త తరహా స్కాంలకు పాల్పడుతున్నారని, అటువంటి నేరగాళ్లు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో జంపుడు డిపాజిట్ స్కాం పేరుతో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ స్కాంతో ప్రజలు తమ బ్యాంకు ఖాతాలోని నగదును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సైబర్ నేరగాళ్లు జంపుడు డిపాజిట్ స్కాంతో యూపీఐ వినియోగదారులకు లక్ష్యంగా చేసుకున్నారన్నారు. బాధితులను ఆకర్షించేందుకు నేరగాళ్లు బ్యాంకు ఖాతాలో రూ.5 వేలు అంతకంటే తక్కువ మొత్తాన్ని జమ చేస్తారని, ఖాతాలో డబ్బు జమ అయినట్టుగా ఒక నోటిఫికేషన్ ఎస్ఎంఎస్ రూపంలో పంపుతార న్నారు. ఆ సమయంలో బాధితులు బ్యాలన్స్ చెక్ చేయడానికి యూపీఐ ఓపెన్ చేసి పిన్ నెంబరు ఎంటర్ చేస్తే, నేరగాడికి యాక్సిస్ లభిస్తుందని, దీంతో ఖాతాలో ఉన్న మొత్తం నగదు మాయం కానుందన్నారు. ఈ నేపథ్యంలో గుర్తింపు లేని నెంబరుతో మీ ఖాతాలో చిన్న మొత్తం జమయితే, వెంటనే బ్యాంకు బ్యాలన్స్‌ని చెక్ చేయవద్దన్నారు. అలా ఎవరైనా సొమ్ము జమ చేసే 15 నిమిషాల నుంచి 30 నిమిషాలు వేచి చూడాలన్నారు. అప్పటికి వారి స్కానర్ అభ్యర్థన గడువు ముగిసిపోతుందని వివరించారు. ఒకవేళ ఖాతాలో నగదు జమ అయిన తరువాత బ్యాలన్స్ చెక్ చేసుకునే సమయంలో ఉద్దేశపూర్వకంగానే తప్పు పిన్ ఎంటర్ చేయాలన్నారు. అలా చేస్తే వారి స్కానర్ అభ్యర్థన క్యాన్సిల్ అవుతుందన్నారు. ఈ తరహా మోసాలకు గురైతే, వెంటనే సైబర్ పోలీసు స్టేషన్ లేదా 1930కి ఫిర్యా దు చేయాలని ఎస్పీ సూచించారు.

సంప్రదాయాలను గౌరవించండి

చీపురుపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మన సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజమహేంద్రవరం జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించకుని ఆయన స్వగ్రామమైన పుర్రేయవలస విచ్చేసి ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ నాడు గ్రామాల్లో వివిధ రకాల పోటీలను నిర్వహించడం ద్వారా భావితరాల వారికి సంప్రదాయాలను నేర్పించడం సాధ్యమవుతుందన్నారు. విజేతలకు ఆయన బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా జోగారావు

విజయనగరం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూని యన్ (ఎస్టీయూ) జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జోగారావు, చిప్పాడ సూరిబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈమేరకు ఎస్టీయూ జిల్లా కార్యవర్గం సంయుక్తంగా ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంపిక చేసినందుకు కార్యవర్గ సభ్యులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగులకు వస్త్రాలు

పూసపాటిరేగ, జనవరి15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొవ్వాడ గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు, స్థానిక సర్పంచ్ కోట్ల రఘు గ్రామంలోని దివ్యాంగులకు మంగళవారం వస్త్రాలను పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా గ్రామంలో పలు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

అండగా ఉంటాం..

రాజాం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మిత్రుడి మృతి మీతో పాటు పాటు మాకు కూడా తీరనిలోటని, మిత్రుడి కుటుంబానికి అన్నివేళలా తోడుగా నిలుస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ (రాజాం శాఖ), ఓల్డ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ (1979-89) అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ కుమార్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటలో బుధవారం నిర్వహించిన గుడివాడ ఉత్తరకుమార్ సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మానం గోవిందరావు, అసోసియేషన్ సభ్యు లు గట్టి పాపారావు, చంద్రశేఖర్, చంద్రి నాయుడు, ఇ.శ్రీనివాసరావు, డా.రఘు, దామెర సీతారమేష్, వై.భాస్కరరావు, అచ్యుతకుమార్, బి.ప్రసాదరావు, మహేశ్వరరావు తదితరులున్నారు.

పేదలకు జీఎంఆర్ వస్త్రదానం



వస్త్రాలు దానం చేస్తున్న జీఎంఆర్

రాజాం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఎంఆర్ గ్రూపు సంస్థల ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు(జీఎంఆర్) సంక్రాంతి రోజున మంగళవారం సాధువులు, పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు వస్త్రదానం చేశారు. ఏళ్లుగా మకర సంక్రాంతి నాడు వేలాది మందికి వస్త్రదానం చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. జీఎంఆర్ ఐటీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సోదరులు, బంధువులతో కలిసి ఆయన ఐదు వేల మందికి వస్త్రాలు అందజేశారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయనతో కుమారులు, కోడళ్లు, కుమార్తె, అల్లుడు, జీఎంఆర్ గ్రూప్ సంస్థల ప్రముఖులు హాజరయ్యారు.

ఇటకర్లపల్లిలో ..

చీపురుపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు బుధవారం తన స్వగ్రామం ఇటకర్లపల్లిలో వస్త్రదానం చేశారు. కనుమ పండగను పురస్కరించుకుని దాదాపు 250 మంది రైతులకు కొత్త తువ్వాళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవం జరుగుతున్న దృశ్యం

నెల్లిమర్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీరామచంద్రస్వామి వారికి అర్చకులు బుధవారం పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. గత నెల 17న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీమద్రామాయణ పారాయణం ప్రారంభించారు. 27 రోజుల అనంతరం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తుల వద్ద రామాయణంలో పట్టాభిషేక సర్గం విన్నవించి శ్రీరామచంద్రస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఉదయం ప్రాతఃకాలార్చన బాలభోగం, అనంతరం యాగశాలలో సుందర కాండ హవనం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, రామ్‌గోపాల్ తదితరులు నిర్వహించారు.

సనాతన ధర్మాన్ని కాపాడుదాం

విజయనగరం రింగురోడ్డు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేదాలు, పురాణాల్లో పేర్కొన్న మాదిరిగా సకల దేవతా స్వరూపాలైన గోవులను రక్షించుకుని సనాతన హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జె.శ్యామసుందరం అన్నారు. బుధవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీవీ నర్సింహాచార్యులు, అమ్మనాన్న సేవాసంస్థ కార్యదర్శి జి.తిరుపతిరావు, దేవకీనందన్, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుడికి సత్కారం

విజయనగరం దాసన్నపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఉంగా ఆదినారాయణను జిల్లా పౌర వేదిక ప్రతినిధులు బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ప్రతినిధులు ప్రభాకరరావు, రామచంద్రరాజు, గోపాలరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోదారోళ్లే.. మరి!

● 200 వంటకాలతో అల్లుడికి ఆతిథ్యం



సంక్రాంతి విందుకు సిద్ధం చేసిన వంటకాలు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఉంటున్న గోదావరి జిల్లా వాసులు సాంప్రదాయాన్ని కొనసాగించారు. తన ఇంటి అల్లుడికి సంక్రాంతి పండుగ సందర్భంగా 200 వంటకాలతో ఆతిథ్యం ఇచ్చారు. విజయనగరం శివారులోని చినతాడివాడలో నివాసం ఉంటున్న తోట వెంకటేశ్వరరావు, ఉమా దంపతులది పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సొంతూరు. ఉద్యోగరీత్యా ప్రస్తుతం ఈ దంపతులు విజయనగరంలో ఉంటున్నారు. పండుగ సందర్భంగా గోదారోళ్ల సాంప్రదాయాన్ని కొనసాగించారు. మంగళవారం తన అల్లుడు ఏలూరు జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన చిలకలపూడి సంతోష్ పృథ్వీ సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. కుమార్తె ధరణి గృహిణి. వీరివురిని సంక్రాంతికి విజయనగరంలోని చినతాడివాడకు ఆహ్వానించారు. వారి సాంప్రదాయం ప్రకారం కొత్త అల్లుడికి స్వాగతం చెబుతూ 200 రకాల వంటకాలతో భోజనం వడ్డించారు. కుమార్తె, అల్లుడు వంటలను ఒకరికొకరు తినిపించుకుంటూ వెంకటేశ్వరరావు దంపతులు మురిసిపోయారు. చినతాడివాడలో ప్రజలు దీనిపై ఆసక్తిగా చర్చించుకోవడంతో పాటు, ఆయా వంటకాలను వారి ఇంటికి వెళ్లి తిలకించారు.

కొత్త అల్లుడికి 100 రకాల వంటలతో భోజనం



100 రకాల వంటకాల ఎదుట చిరంజీవి, ఉమాదేవి

మాడుగుల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి అల్లుళ్లకు అత్తింటివారు ప్రత్యేక ఆతిథ్యం ఇస్తుంటారు. గోదావరి జిల్లాల్లో వందలాది వంటకాలు వడ్డించినట్టు వార్తలు చూస్తుంటాం. ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో కూడా అలాంటి సంస్కృతికి నాంది పలుకుతున్నారు. వి.మాడుగుల మండలం వీరవిల్లి అగ్రహారంలో సంక్రాంతి పండగకు వచ్చిన కొత్త అల్లుడికి అత్తింటివారు 100 రకాల వంటలు వడ్డించారు. పల్లెల వెంకట సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె ఉమాదేవికి గతనెల డిసెంబరులో విజయనగరం జిల్లా రాజాంకు చెందిన చిరంజీవికి వివాహమైంది. సంక్రాంతికి రాజాం నుంచి వీరవిల్లి అగ్రహారం వచ్చిన చిరంజీవి కోసం సత్యనారాయణ దంపతులు వంద రకాల వంటకాలు తయారుచేయించారు. నూతన దంపతులకు ఆ పదార్థాలను పెద్ద అరటి ఆకులో వడ్డించారు. ఈ ప్రాంతంలో కొత్త అల్లుడికి వంద రకాల వంటకాలు వడ్డించడం ఇదే తొలిసారి అని పలువురు చర్చించుకుంటున్నారు.

కిటకిటలాడిన తాటిపూడి

గంట్యాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ పర్యాటకులతో కిటకిటలాడింది. సంక్రాంతి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి రిజర్వాయర్ వద్దకు అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. గత ఐదేళ్లు లేని బోటు షికారు 15 రోజులు క్రితం ప్రారంభించడంతో బోటు షికారు చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. రెండు రోజులుగా రిజర్వాయర్ ప్రాంతం కళకళలాడింది.

రిజర్వాయర్ వద్ద సందర్శకులు →



ఘనంగా తీర్థ మహోత్సవాలు



చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగుబిల్లిలో పైడితల్లమ్మ తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపంగా ఐదువందల ఏళ్లనాటి చెట్టుకు ఏటా పూజలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. తీర్థ మహోత్సవంలో భాగంగా భక్తులకు అన్న సమారాధన చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని టీడీపీ నాయకుడు గొంప కృష్ణ దర్శించుకున్నారు.

●వేపాడ: మండలంలోని కొండగుళ్ల బ్రహ్మలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం, కృష్ణారాయుడిపేటలో కృష్ణరాయుడుస్వామి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణరాయుడుస్వామి తీర్థ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలో దేవరాపల్లికి చెందిన లక్ష్మీనరసింహస్వామి బండి విజేతగా నిలిచింది. రెండో స్థానంలో వల్లంపూడికి చెందిన సిద్ధివినాయక బండి, మూడో స్థానంలో వావిలపాడుకు చెందిన వెంకటరావు బండి, నాలుగో స్థానంలో కలగాడకు చెందిన కోలుపర్తి రామునాయుడు బండి నిలిచాయి.

కొటారుబిల్లి తీర్థ మహోత్సవం నేడు..

●గంట్యాడ: కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తులు కొంగు బంగారం కొటారుబిల్లి కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం గురువారం మధ్యాహ్నం జరుగనుంది. ఏటా కనుమ పండగ మరుసటి రోజున కనకదుర్గమ్మకు తీర్థ మహోత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఈ ఏడాది కూడా అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తీర్థ మహోత్సంలో భాగంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేయనున్నారు. అందరికీ అమ్మవారి దర్శనం కల్పించాలని ఉద్దేశంతో నిర్వహకులు ప్రత్యేక దర్శన సదుపాయం కల్పిస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటలుకు ప్రారంభం కానున్న తీర్థ మహోత్సవం రాత్రి 8 గంటల వరకూ సాగనుంది. మండల ప్రజలు కాకుండా ఇతర జిల్లాలు నుంచి వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గంట్యాడ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ సాయికృష్ణ ఆలయ పరిసరాలను పరిశీలించారు.

పండుగకు వచ్చి.. బస్సు ఢీకొని..

● ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం

క్రైం న్యూస్

సాలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు వచ్చిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో బస్సు ఢీకొనడంతో మంగళవారం సాయంత్రం దుర్మరణం పాలయ్యాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సాలూరు లెప్రసీ కాలనీకి చెందిన బలగ శ్యాంసన్ (19) సబ్బవరం మండలంలోని పైడివర అగ్రహారంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పురస్కరించుకుని యాజమాని విధులకు సెలవులు ఇవ్వడంతో ఆదివారం సాలూరు వచ్చాడు. తన బంధువులు బాగువలస ఉండడంతో వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో చంద్రంపేట సబ్‌స్టేషన్ సమీపంలో మలుపు వద్ద దుగ్గేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో శ్యాంసన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సాలూరు రూరల్ ఎస్ఐ పి.నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు.

మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుతాడనగా...

బాగువలస నుంచి వస్తున్న శ్యాంసన్ మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకోనున్నాడు. ఈలోగా బస్సు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. చిన్నతనంలోనే తండ్రి రామకృష్ణ మృతి చెందాడు. తల్లి జగదీశ్వరి పనులు చేసి పెంచి పెద్ద చేసింది. చేతికి అందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో ఆమె రోదిస్తోంది.

వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

సీతానగరం మండలంలో వేర్వేరు ఘటనల్లో గాయపడిన ముగ్గురు వ్యక్తులు చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

సువర్ణముఖి నదిలో ఇసుక గోతుల్లో పడి..

సీతానగరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సీతానగరం వద్ద సువర్ణముఖి నది గోతిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం పోలీసుల వెల్లడించిన వివరాల మేరకు.. పెదభోగిలి గ్రామానికి చెందిన సురగాల అనుదీప్ (27) తన చెల్లెలు, బంధువులతో మంగళవారం మధ్యాహ్నం సువర్ణముఖినదిపై ఉన్న ఆర్అండ్‌బీ బ్రిడ్జి సమీపంలో స్నానాలు చేయడానికి వచ్చారు. అందరూ స్నానాలు చేసుకుని ఒడ్డుకు చేరుతున్నారు. ఆ సమయంలో ఇసుక కోసం తీసిన గోతిలో అనుదీప్ మునిగిపోయాడు. బయటకు రాలేకపోవడాన్ని గుర్తించిన అనుదీప్ చెల్లెలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ ఎం.రాజేష్, అనుదీప్‌ను బయటకు తీశారు. అనంతరం 108 వాహనంలో చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనుదీప్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.

బూర్జలో..

చికిత్స పొందుతూ ఓ మహిళ బుధవారం మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బూర్జలో స్నానం చేయడానికి అల్లు విజయలక్ష్మి ఈనెల పదో తేదీన వంట కలపతో నీరు కాయడానికి మంట పెట్టింది. ఆ సమయంలో మరో పని చేస్తుండగా ఆమె చీరకు మంట తగలడంతో శరీరంపై గాయాలయ్యాయి. దీంతో విజయలక్ష్మిని పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. విజయలక్ష్మి భర్త జగ్గునాయుడు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రామవరం సమీపంలో..

గంట్యాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మంగళవారం మృతి చెందారు. ఘటనకు సంబంధించి ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ప్రకారం ఈనెల 13న రామవరం గ్రామానికి చెందిన పి.వాసు (30) గ్రామం నుంచి విజయనగరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఆయన్ని ఢీకొంది. దాంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూవాసు మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

గంట్యాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖపట్టణంలోని కంచరపాలెం గ్రామానికి చెందిన కె.ప్రకాశరావు మృతి చెందారు. ఘటనకు సంబంధించి ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ప్రకాశరావు విజయనగరం కలెక్టరేట్ వద్ద రామవరం రావడానికి గంట్యాడ వైపు వస్తున్న ఆటో ఎక్కారు. రామవరం గ్రామ సమీపంలో వచ్చేసరికి అదే దారిలో ఉన్న కారును ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఆటోలో ఉన్న ప్రకాశరావు తీవ్రంగా గాయపడటంతో వెంటనే విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికితత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతుడి బంధువుల ఆచూకీ దొరకలేదని, వివరాలు తెలిస్తే 912119442 నెంబరుకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

ఎడ్ల పరుగు పోటీలో అపశ్రుతి..

వేపాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారాయుడిపేటలో బుధవారం నిర్వహించిన తీర్థ మహోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. ఎడ్ల పరుగు పోటీలో పరుగు తీస్తున్న బండి ఒక్కసారిగా అదుపు తప్పి జనాల మధ్య నుంచి దూసుకుపోయి ఓ వ్యక్తిని ఢీ కొట్టింది. ఘటనలో కె.కోటపాడు మండలం రామయ్య అగ్రహారం గ్రామానికి చెందిన ఇంగుడుబిల్లి నాయుడు(35) తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్టు సమాచారం. ఘటనపై వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి కేసు నమోదు చేశారు.

నిరుపేదలకు నిత్యావసరాల అందజేత



సరుకులు అందజేస్తున్న గౌరీశ్వరరావు, శిరీష

విజయనగరం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గుంటూరు వారి వీధి బృందావన్ అపార్ట్‌మెంట్‌లో సోమవారం సుధారాణి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 25 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు, కార్యదర్శి ఉపేంద్రకుమార్, కోశాధికారి శిరీష ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఏటా సంక్రాంతి పండుగకు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తామన్నారు. అలాగే తమ వంతు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. మున్ముందు ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో శిష్టకరణ సంఘం ప్రతినిధులు బలివాడ వెంకటరమణారావు, బుదరాయవలస మధుసూదనరావు, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, దుస్తుల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న రఘురామారావు

విజయనగరం దాసన్నపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రేమసమాజం వృద్ధాశ్రమంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కనకల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కనకల రఘురామారావు మాట్లాడుతూ 17 ఏళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు సంక్రాంతి పండుగ సందర్భంగా దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో మధు, రమణ, రాము, పైడిరాజు పాల్గొన్నారు.



మరుగుదొడ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిన దృశ్యం

మోటారు పనిచేయక..నిర్వహణకు నోచుకోక

● మహిళలకు తప్పని అగచాట్లు ● ఇదీ కోరాడవీధిలో సామాజిక మరుగుదొడ్ల దుస్థితి

బొబ్బిలి/బొబ్బిలిరూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలో గల కోరాడవీధి శివారున (సాదీఖానా) దగ్గరలో ఏర్పాటుచేసిన సామాజిక మరుగుదొడ్లు మోటారు పని చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కాలనీలో ఆరుబయట మలవిసర్జన నిర్మూలించాలన్న లక్ష్యంతో నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణపై మునిసిపల్ అధికారులు దృష్టి సారించకపోవడంతో వినియోగంలో లేకుండాపోయాయి. మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మరుగుదొడ్లు చుట్టూ పిచ్చిమొక్కలు, డొంకలు, తుప్పలు పెరిగిపోయాయి. ఈనేపథ్యంలో పరిసరాలు అధ్వానంగా మారడంతో కోరాడవీధి వాసులు రోడ్లు, కాలువలపై బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. చీకటిపడిన తర్వాత ఆరుబయ టకు వెళ్లడానికి మహిళలు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులుచేసి మరుగుదొడ్ల పరి సరాల్లో శుభ్రంచేసి వినియోగంలోకి తీసుకురా వాలని పలువురు కోరుతున్నారు. కాగా మరుగుదొడ్లకుసంబంధించిన మోటర్ పనిచేయడం లేదని ఏఈ దృష్టికి తీసుకువెళ్లినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి తెలిపారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

● డంపింగ్ యార్డు వల్ల నిరుపయోగంగా మారిన వైనం

● ఇదీ పార్వతీపురంలోని టీటీడీ కల్యాణ మండపం దుస్థితి

పార్వతీపురంటౌన్,జనవరి15(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో పేద, మధ్యతరగతి కుటుంబాల వివాహాలు తక్కువ ఖర్చుతో నిర్వహించుకోవాలని ఆశయంతోనిర్మించిన కల్యాణ మండపం ఆశయం నీరుగారుతోంది. ప్రధానంగా కోట్లాది రూపాయలతో నిర్మించినా అధికారులు నిర్వహణను గాలి కొదిలేశారు. సమీపంలో డంపింగ్‌యార్డు ఉండడం వల్లే నిరుపయోగంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

పేద కుటుంబాలు తక్కువ ఖర్చుతో ప్రశాంతంగా శుభకార్యక్రమాలు నిర్వహించుకోవాలని భావించి టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016-17లో పట్టణ శివారుల్లో దాతల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిర్మించారు. అప్పటి మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ, పట్టణానికి చెందిన మరికొంతమంది నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు టీడీడీ కల్యాణ మండప ప్రారంభించిన విషయం విదితమే. సుమారు రూ.1.20 కోట్లతో కల్యాణ మండప నిర్మించినా ఇప్పటివరకు ఒకే ఒక్క వివాహం జరగడం విశేషం. కొవిడ్ సమయంలో పునరావాస కేంద్రంగా వినియోగించిన విషయం విదితమే. సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుచేయడం వల్ల టీడీపీ కల్యాణ మండపంలో ఏ ఒక్కరూ శుభ కార్యక్రమాల నిర్వహణకు ముందుకురావడంలేదని పలువురు చెబుతున్నారు. తక్షణమే డంపింగ్ యార్డు తరలించి టీటీడీ కల్యాణ మండపానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం



నిరుపయోగంగా ఉన్న ధర్మవరం ఎస్సీ వసతిగృహం

నిర్మించారు.. వదిలేశారు

● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

● ఇదీ ధర్మవరం ఎస్సీ బాలుర వసతిగృహం భవనం పరిస్థితి

శృంగవరపుకోట రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం ఎస్సీ బాలుర వసతిగృహం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వంహయాంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంతో 2006 రూ.కోటి 50 లక్షలతో నిర్మించిన భవనం వృథాగా వదిలేశారు. దీంతో ఇది అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారింది.రాత్రి, పగలు తేడాలేకుండా మందుబాబులు, పేకాటరాయుళ్లతోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ మలవిసర్జనకు వినియో గిస్తున్నారు. అప్పటినుంచి ఇది నిరుపయోగంగా మారింది. పటిష్ఠంగా ఉన్న ఈ భవనంప్రభుత్వ కార్యాలయాలు,గ్రామసచివా లయం, అంగన్ వాడీల సేవలకు వినియోగించుకోవాలని పలువురు సూచిస్తున్నారు. కొద్దిపాటి మరమ్మతులు చేయించి, చుట్టూ పెరిగిన తొలగించాలని పలు వురు కోరుతున్నారు. ఇప్పటికే ధర్మవరం పంచా యతీ సచివాలయం ఇరుకు గదుల్లో నిర్వహిస్తుం డడంతో తక్షణమే ఇక్కడకు తరలించాలని పలు వురు సూచిస్తున్నారు.

అక్కడ బహిరంగం.. ఇక్కడ రహస్యం..!

(5వ పేజీ తరువాయి)

సంక్రాంతి నుంచి శ్రీరామనవమి వరకు గ్రామాల్లో కనిపిస్తాయి. అంత వరకు ప్రతి రోజు ఏదో ఒక ఊర్లో గ్రామ దేవతల తీర్థాలు జరుగుతాయి. ఒకటి నుంచి మూడు రోజుల పాటు వీటిని నిర్వహిస్తారు. ఈ సమయంలో పేకాట, పందెం తప్పనిసరి. ఇవి ఉంటేనే ప్రజలు పెద్ద ఎత్తున వస్తారు. దీంతో తీర్థాలను విజయవంతం చేసుకొనేందుకు గ్రామ ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా ఒకటవుతున్నారు. పోలీస్‌లు గ్రామ దేవతల తీర్థాల వైపు చూడకుండా ఇరు పార్టీలకు చెందిన గ్రామ స్థాయి నేతలు తమ తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులను కలుస్తున్నారు. దీంతో తీర్థాలు ముగిసే వరకు కోడి పందేల నివారణ పోలీస్‌లకు కత్తి మీద సామే.

పాలకొండలో రాజశేఖరం అంత్యక్రియలు



రాజశేఖరం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పాలకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని సమీపంలోని నాగావళి తీరంలో రాజ్యసభ మాజీ సభ్యుడు పాలవలస రాజశేఖరం అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. తొలుత మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎండోమెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీరాం సత్యనారాయణ, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాద రావు, బొత్స సత్యనారాయణ, పీడిక రాజన్నదొర, సీదిరి అప్పలరాజు,ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, గొండుశంకర్, కూన రవికుమార్, కోండ్రు మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యేలు కళావతి, అలజంగి జోగారావు, వైసీపీ నాయకులు తలే రాజేష్, చిన్న శ్రీను, ఆరోగ్యశ్రీ మేనే జర్ దూబ రాంబాబు, పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ ప్రయోగమూర్తి తదితరులు రాజశేఖరం ప్రార్థివదేహం వద్ద నివాళులర్పించారు. రాజశేఖరం కుటుంబసభ్యులు పాలవలస విక్రాంత్, రెడ్డిశాంతి, పాలవలస ఇందుమతి, గౌరీపార్వతి, పాలవలస ధవళేశ్వరాన్ని పరామర్శించారు.

క్రికెట్ విజేత రావివలస

గరుగుబిల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రావివలసలో ఫ్రెండ్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ రావివలస జట్టు విజయం సాధించింది. సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో 13 జట్లు పాల్గొన్నాయి.ఈ మేరకు బుధవారం విజేతలకు నిర్వాహకుతోపాటు ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్ బహుమతులు ప్రదానంచేశారు.

● బొబ్బిలి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో బుధవారం క్రికెట్ పోటీలు గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు ఎంపీటీసీ తిరుపతిరావు, బొద్దల సత్యనారాయణ బహుమతులు అందజేశారు.

పిరిడిలో కబడ్డీ ..

బొబ్బిలి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడిలో సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని కబడీపోటీలు ఉత్సాహంగా ఘనంగా నిర్వహించారు. పోటీలకు గొల్లపల్లి, వెంకటరాయుడుపేట నుంచి 30 జట్లు హాజరయ్యా యని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు సర్పంచ్ భరత్ బహుమతులు అందజేశారు.

గజరాయునివలసలో రాతి బండ ..

బాడంగి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజరాయునివలసలో సంక్రాంతి పురస్కరించుకుని 800కేజీల బరువుగల రాతిబండను ఎడ్లు ద్వారా లాగించేపోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 20 జట్లు పాల్గొనగా మక్కువ మండలంలోని శంబర గ్రామానికి చెందిన జాడ దాలయ్య మొదటి బహుమతి, రెండో బహుమతి అదే మండలానికి చెందిన నగిరెడ్డి త్రినాథ, తెర్లాం మండలం లోచర్ల గ్రామానికి చెందిన వెలగల వెంకటరమణ తృతీయ బహుమతి గెలుచుకున్నారు.

పాత బొబ్బిలినాయుడు వీధిలో రంగవల్లులు ..

బొబ్బిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):పాత బొబ్బిలి నాయుడు వీధి యువత ఆధ్వర్యంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు పర్యవేక్షణలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు.విజేతలకు కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చోడి గంజి రవి, కౌన్సిలర్ రాములు పాల్గొన్నారు.

మన్యానికి పోటెత్తిన పర్యాటకులు

సీతంపేట రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి):సీతంపేట మన్యంలోని పర్యాటక ప్రాంతాల్లో పండగ సందడి నెలకొంది. భోగి, సంక్రాంతి, కనుమ పురస్కరించుకుని ఏజెన్సీ ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలకు పోటెత్తారు. ఆడలీ వ్యూ పాయింట్,మెట్టుగూడ జలపాతం,ఎన్‌టీఆర్ అడ్వంచర్‌పార్క్‌తో పాటు సున్నపుగెడ్డ జలపాతం అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఎగబడ్డారు. ఆడలీ వ్యూపాయింట్‌లో ప్రకృతి అందాలను తిలకిస్తు ఫోటోలు తీసుకొని సందడి చేశారు. అడ్వంచర్ పార్క్‌లో సాహసక్రీడల్లో మహిళలు, యువత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కురుపాంరూరల్,జనవరి 15 (ఆంధ్రజ్యోతి):కురుపాంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1984లోచదువుకున్న విద్యార్థులు ఆత్మీయసమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. బరాటం లక్ష్మీప్రకాస్ ఇంట్లో ఏర్పాటుచేసిన సమ్మేళనంలో గత స్మృతులను నెమరువేసుకున్నారు.

కిలో చికెన్ రూ.200.. మటన్ రూ. వెయ్యి

● బొబ్బిలిలోని దుకాణాల వద్ద బారులు తీరిన వినియోగదారులు

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి, బాడంగి తదితరమండలాల్లో కనుమ పురస్కరించుకుని మాంసం కొనుగోలుకు వినియోగదారులు బారులుతీరారు. కిలోచికెన్ రూ.200, మటన్ వెయ్యికి విక్రయించారు. మాంసానికి డిమాండ్‌పెరగడంతో ఒక్కసారిగా వ్యాపారులు ధరపెంచేశారు. ఒక్కోగ్రామంలో 15 నుంచి 25 గొర్రెలు మాం సం కోసం వేటచేశారు. గొర్రెలు, కోళ్ల నిర్వాహకులు ధరలు పెంచేశారని వినియోగదారులు వాపోయారు.



గరుగుబిల్లి:ఉల్లిభద్రలో గంగిరెద్దుకు పూజలు చేస్తున్న మహిళలు



భామిని:నులకజోడులో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న మహిళలు



కొమరాడ: నాగావళి తీరంలో సరదాగా గడుపుతున్న యువకులు

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

● కిటకిటలాడిన నదీతీరాలు

● భక్తిశ్రద్ధలతో గోపూజ



కురుపాం: గంగిరెద్దులకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఉమ్మడి జిల్లాలోని పల్లెల్లో సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయాలు గుర్తుచేశారు. కనుమ పురస్కరించుకుని భక్తి శ్రద్ధలగో గోపూజలు చేశారు. పలువురు సంప్రదాయ వస్త్రాలను ధరించారు. పిల్లలు,పెద్దలు ఆటపాటలతో సందడిచేశారు. ఇళ్ల ముందు ప్రత్యేక ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. హరిదాసులకు అక్షయ పాత్రలో బియ్యం, డబ్బులు వేసి పూజలు నిర్వహించారు. సంక్రాంతి కి బంధువులు, దూర ప్రాంతాల్లో ఉండేవారు స్వస్థలాలకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థులకు ఆటల పాటలతోపాటు టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలన్ను గ్రామపెద్దలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జిల్లాలో నాగావళి, జంఝావతి తదితర నదీ తీరాల్లో ఇసుక దిబ్బలపై యువత, మహిళలు కనుమ సాయంత్రం సేదదీరారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పాలకొండ: గోపూజను నిర్వహిస్తున్న దృశ్యం



వీరఘట్టం: నాగావళి తీరంలో సందడి చేస్తున్న కడకెల్ల గ్రామస్థులు



బాడంగి:గజరాయునివలసలో సంప్రదాయ దుస్తుల పోటీల్లో పాల్గొన్న బాలికలు



బొబ్బిలి రూరల్: కోలాటం ప్రదర్శిస్తున్న బృందాలు



పాలకొండ: పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ నంబాళ్ల అనుపమ చక్రవర్తికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం



గరుగుబిల్లి: తోటపల్లి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తుల పూజలు

జిల్లాలోని తోటపల్లి, కోటదుర్గమ్మ ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తులు పూజలు చేశారు. తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాలను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, కోటదుర్గమ్మను పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ నంబాళ్ల అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు.

●పార్వతీపురంటౌన్/గరుగుబిల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం శివారుల్లో గల ఆశాజ్యోతి ఆశ్రమాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్. దామోదరరావు పాల్గొన్నారు. అలాగే గరుగుబిల్లి మండ లంలోని తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, మన్యం జిల్లా న్యాయాధికారి దామోదర్ దర్శించుకున్నారు.

●పాలకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని కోటదుర్గమ్మ అమ్మవారిని పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ నంబాళ్ల అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బస్సులు లేక ప్రయాణికుల పడిగాపులు



బస్సు ఎక్కేందుకు కుస్తీలు పడుతున్న ప్రయాణికులు

బొబ్బిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పరిసర ప్రాంతాల ప్రయాణికులు పండుగపూట బస్సులకోసం పడిగాపులు కాశారు. సంక్రాంతి, కనుమ పురస్కరించుకుని ప్రత్యేకంగా ఆర్టీసీ అధికారులు బస్సుల నడిపడానికి చర్యలు తీసుకోలేదు. దీంతో బస్సులు లేకపోవడంతో బుధవారం బొబ్బిలిబస్టాండ్ ప్రయాణికులు అగచాట్లకు గురయ్యారు.బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. అడపాదడపా వచ్చిన బస్సుల్లో సీట్ల కోసం కుస్తీలు పట్టారు. ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు.

తాలాడలో నీలమ్మతల్లికి మొక్కుల చెల్లింపు

భామిని, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తాలాడలో కనుమ పురస్కరించుకుని బుధవారం నీలమ్మతల్లికి మొక్కులు చెల్లించారు. సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కుటుంబాలు, బంధువులు ఏటా కనుమ రోజు మేళతాళాలు, ఘటాలతో ఊరేగించి నీలమ్మతల్లికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది.

●సాలూరు రూరల్,జనవరి 15 (ఆంధ్రజ్యోతి):సాలూరులోని కామాక్షి అమ్మవారు భక్తులకు కనుమ సందర్భంగా వెండి చీరతో బుధవారం దర్శనమిచ్చారు.ఆలయవ్యవస్థాపక గురువు ముద్దు సత్యనారాయణ అమ్మవారికి పూజచేశారు.మంగళవారం ఏకామ్రనాథ్, కామాక్షి అమ్మవారికి పట్టణంలో రథోత్సవం నిర్వహించారు. అలాగే మకర సంక్రాంతి పురస్కరించుకుని మంగళవారం రాత్రి అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి పూజలు చేశారు కార్యక్ర మంలో ఆలయ చైర్మన్ హరిస్వామి, కార్యదర్శి జరజాపు పైడినాయుడు పాల్గొన్నారు.



భామిని: తాలాడలో ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

కోడి రామ్మూర్తినాయుడికి నివాళి

వీరఘట్టం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని తెలగవీధిలో గల కోడిరామ్మూర్తినాయుడు విగ్రహానికి బుధవారం శ్రీలంక నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువు బోధిహిన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడిరామ్మూర్తినాయుడు గురించి తెలుసుకొని ఇక్కడకు వచ్చానని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోడి వెంకటనాయుడు, సత్యారావు, మన్మథరావు, వెంకటరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.